ప్రజా విశ్వంభర 1/3 NEWS

తెలంగాణను వంచించిన కేంద్ర బడ్జెట్

డా.కాచం సత్యనారాయణ

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చింది.రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలకు ఎలాంటి కేటాయింపులు, ప్రకటనలు చేయకుండా కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది.2026-27 వార్షిక కేంద్ర బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఇది పూర్తిగా నిరాశజనకం. రాష్ట్రం నుండి కేంద్రానికి వేల కోట్ల రూపాయల పన్నులు వెళుతున్నప్పటికీ, తిరిగి నిధులు కేటాయించడంలో కేంద్రం మరోసారి తెలంగాణ పట్ల వివక్ష చూపింది. రాష్ట్రం ఏర్పడి 12 ఏండ్లు అవుతున్నా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విభజన హామీలు స్టీల్ ఫ్యాక్టరీ, హైదరాబాద్‌కు మెట్రో, రీజినల్ రింగ్ రోడ్డు, రాష్ట్రంలో ఒక సాగునీటి ప్రాజెక్టు జాతీయ హోదా, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు ప్రకటన డిమాండ్స్‌ను బడ్జెట్‌లోవిస్మరించారు.ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్య నిరుద్యోగం, ఆర్థిక అంతరాలకు సంబంధించి ఏలాంటి పరిష్కారం చూపలేదు. ఈ బడ్జెట్ మధ్య తరగతి పేదలకు ఉపశమన ఇవ్వకపోగా, కార్పొరేట్స్‌కే అనుకూలంగా ఉంది.

కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ

విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తకపోవడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిలేమికి నిదర్శనం. వ్యవసాయ ఆధారిత దేశంలో, రైతుల సంక్షేమాన్ని కేంద్రం గాలికి వదిలేసింది. స్వామి నాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర చట్టంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణం.. ఎరువుల సబ్సిడీలలో కోత విధించడం నల్లగొండ వంటి వ్యవసాయ ఆధారిత జిల్లాల రైతులపై పెనుభారం మోపుతుంది.

రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడేలా లేదు..

బడ్జెట్ పూర్తిగా దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడేలా లేదు. కేంద్ర ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పులు, వడ్డీలు కట్టాల్సి వస్తున్నది.పని దినాలు పెంచామని చెప్పినప్పటికీ 'వీబి జిరాంజి' పథకానికి కేవలం రూ.93 వేల కోట్లు కేటా యించి గతంతో పోలిస్తే కోత పెట్టారు. వ్యవ సాయ రంగానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి నిధులు తగ్గించారు. ఈ రంగాలకు గతంలో కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు చేయలేదు. దేశ కార్పొరేట్ సంస్థలైన ఆదానీ, అంబానీ తదితరులకు డేటా సెంటర్ల పేరుతో రాయితీలు ప్రకటించారు. సంక్షేమ పథకాలు, ఎరువుల రాయితీలు, చిన్న పరిశ్రమలకు ఎలాంటి రాయితీలు ప్రకటించలేదు. ఉద్యోగులకు ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచకుండా నిరాశపర్చింది. తెలంగాణ రాష్ట్రానికి వాటాగా రావాల్సిన నిధులు తగ్గించారు. పన్నుల వాటాలో 2.11 శాతం ప్రకారం రూ.63 వేల కోట్లు రావాల్సిందని, గతఆర్థికసంవత్సరానికి సంబంధించి రూ.4 వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. జీఎస్టీ పన్నుల వల్ల ఇప్పటికే రాష్ట్రాలు ఆర్థికంగా సతమతమవుతుంటే పన్నుల వాటాను తగ్గించడం శోచనీయం.పాలమూరు, రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా యివ్వాలని కోరుతున్నా వాటి ఊసే లేదు. ఫార్మా రంగానికి అవసరమైన నిధులు కేటాయిం చలేదు. విద్యా, వైద్య రంగాలు పూర్తిగా కార్పొరేట్ మయమవుతున్న పరిస్థితుల్లో పేదలకు ఆ రంగాలు అందుబాటులోకి తేవడానికి తగినన్ని నిధులు కేటాయించలేదు. వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు.

చేనేత రంగానికి అన్యాయం..

పోచంపల్లి, నారాయణపూర్, పుట్టపాక వంటి ప్రాంతాల్లోని చేనేత కార్మికులు ఎప్పటినుండో కోరుతున్నట్లుగా, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తి వేయకపోవడం శోచనీయం. ముడి సరుకుల ధరలు పెరిగి నేతన్నలు ఇబ్బంది పడుతుంటే, బడ్జెట్‌లో వారికి ఎలాంటి ఊరట కల్పించలేదు. నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ బాధితుల పునరావాసానికి లేదా ఫ్లోరోసిస్ రీసెర్చ్ సెంటర్ బలోపేతానికి ప్రత్యేక నిధులు కేటాయిం చకపోవడం విచారకరం. అలాగే రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణకు సంబంధించి కేంద్ర వాటా నిధులపై స్పష్టత లేదు.

సార్వత్రిక విద్యా సాధన లక్ష్యానికి దూరం..

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు సార్వత్రిక విద్యా సాధన లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. గతసంవత్సరం 1,28,650 కోట్లు కెటాయించగా ఈ సంవత్సరం 1,39,289 కోట్లు కేటాయించారు. అంకెల్లో స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ మొత్తం బడ్జెట్ దామాషాలో తక్కువగానే ఉంటుంది. పెరిగిన ధరలతో పోలిస్తే మధ్యాహ్నం భోజనం, సమగ్ర శిక్ష కు కెటాయించిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదు.జాతీయ విద్యా కమీషన్ సిఫారసు చేసిన విధంగా బడ్జెట్లో 10 శాతం, జిడిపిలో 6 శాతం కేటాయింపుకు అందనంత దూరంలో ప్రస్తుత కేటాయింపులు ఉన్నాయి.

ఉద్యోగులకు దక్కని ఊరట

కేంద్ర బడ్జెట్ లో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతుందని ఆశించిన ఉద్యోగులకు ఊరట లభించలేదు. గత సంవత్సరం తీసుకువచ్చిన ఆదాయపన్ను చట్టం ప్రకారమే పన్ను స్లాబులు ఉంటాయని ప్రకటించటం అన్యాయం. గత 12 సంవత్సరాలుగా ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెంచలేదని, సేవింగ్స్ మొత్తాలపై రిబేటును పెంచలేదు. . పాత విధానాన్ని కొనసాగిస్తూ, కొత్త విధానాన్ని ప్రోత్సహించడానికే కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతోంది.

నిరుద్యోగం - ధరల పెరుగుదల..

పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడం వల్ల నిత్యావసర ధరలు సామా న్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. దేశంలో నిరుద్యోగం పెరుగుతుంటే, యువతకు ఉపాధి కల్పించే నిర్దిష్ట ప్రణాళికలేవీ ఈ బడ్జెట్‌లో లేవు. తెలంగాణకు రైల్వే లైన్లు, కోచ్ ఫ్యాక్టరీ, విమానాశ్రయాల అభివృద్ధి, భారత్ ఫ్యూచర్ సిటీ, మెట్రో కారిడార్, నిరుద్యోగం రూపు మాపేందుకు, ఉద్యోగ, ఉపాధి మార్గాలు, కొత్త జాతీయ రహదారులకు బడ్జెట్ లో ఏమాత్రం కేటాయింపులు లేకపోవడం వివక్షే. యువత, మహిళ సంస్కరణలను ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించింది.కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా అంకెల గారడీ తప్పా.. పేద, మధ్య తరగతి, రైతు, మహిళలకు ఒరిగింది ఏమీ లేదు.పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చివరగా, ఈ బడ్జెట్ కేవలం అంకెల గారడీ తప్ప, సామాన్య ప్రజలకు, రైతులకు, కార్మికులకు ఒరిగేదేమీ లేదు. ఇది పూర్తిగా తెలంగాణ ప్రజలను వంచించిన బడ్జెట్.

అన్ని తీర్పుల్లో న్యాయం ఉండదు



తీర్పులన్నిటిలో "న్యాయం"ఉన్నట్లేనా? అంటే.. జవాబుచెప్పడం కష్టమే.సానుకూలమైన జవాబు మాత్రం లభించడం లేదు.సాంకేతికంగా అన్ని తీర్పులూ న్యాయమైనవే అవుతాయి.కానీ అన్ని తీర్పుల్లో న్యాయం ఉండదు.కోర్టులు తమ ముందుంచినసాక్ష్యాధారాలఆధారంగా మాత్రమే విచారించి తీర్పులిస్తాయి.అంటే ఆ తీర్పులు న్యాయమైనవి ఎలా అవుతాయి?కావు కదా. విచారణ వ్యవస్థకు ఆ నేరానికి సంబంధించిన సాక్ష్యాలు, ఆధారాలు లభించి ఉండకపోవచ్చు. నేరం చేసిన వాడు నేరానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పూర్తిగా ధ్వంసం చేసి ఉండవచ్చును.విచారణ వ్యవస్థను ప్రలోభాలతో సదరు నిందితుడు /నేరస్థుడు ప్రభావితం చేసి ఉండొచ్చు.విచారణ వ్యవస్థపై పెద్దల ఒత్తిడి ఉండవచ్చు. నేరస్తుడికి అండగా సర్కారీ పెద్దలు నిలవవచ్చు.వారు కోర్టును,విచారణ వ్యవస్థనూ ప్రభావితం చేసి నేరస్థుడిని నిర్దోషిగా నిరూపించే ప్రయత్నం కూడా చేయవచ్చును.ఈ కారణాలతో సదరు కోర్టు నేరాన్ని నిర్ధారించలేక పోవచ్చు.అంతా సక్రమంగానే ఉన్నా న్యాయమూర్తి సదరు ఆధారాలతో సంతృప్తి చెందక పోయిపోవచ్చు కూడా.ఆ న్యాయమూర్తిలో మానవముఖం కూడా లోపించి ఉండవచ్చు.చట్టం, న్యాయ స్పృహ లోపించి ఉండవచ్చును కూడా. సదరు న్యాయమూర్తిలో సమతాదృష్టి లేక పోవచ్చు.న్యాయ స్పృహలోపించి ఉండపోవచ్చు. ఏ భావజాలానికో బంధీ అయి ఉండవచ్చును కూడా. ప్రలోభానికి లొంగి పోయి నేరస్తుడికి అనుకూలంగా తీర్పు నివ్వవచ్చు. ఇవే కాక ఇంకెన్నో కారణాలతో నేరం చేసిన వ్యక్తి నిర్దోషిగా బయటపడి గల్లా/కాలర్ ఎగరేసుకొని తిరగవచ్చును.ఈ లెక్కన అన్ని తీర్పులూ న్యాయమైనవి కావు. అన్ని తీర్పుల్లో న్యాయం ఉండదు అని అర్థం చేసుకోవాలి. బహిరంగ అత్యాచారాలు, హత్యలు చేసి వీధుల్లో కాలర్ ఎగ రేసుకుంటూ తిరుగుతున్న అనేక మంది నేరస్తులు మనకు ఇప్పుడు కనపడుతున్నారు.అత్యాచారం హత్య కేసుల్లో నేరం నిరూపించబడి పేరోళ్లపై బయట సంచరిస్తున్న నేరస్తులు, ఏ నేరం చేయకుండానే జైళ్లలోనే అన్యాయంగా శిక్షను అనుభవిస్తున్న అమాయకులు అనేకులున్నారు. బ్యాంకుల నుంచి అక్రమ పద్ధతుల్లో వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకొని వాటిని ఎగవేసి దర్జా తిరుగుతున్న వారిని కూడా మనం చూస్తున్నాం. ఇలాంటి దుస్థితిలో ఉన్న న్యాయ వ్యవస్థ ఇంకా కట్టడి చేసే ప్రయత్నాలు అనేకం జరుగుతున్నాయి. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వాటికి లొంగి పోకుండా గొప్పతీర్పులను ఇచ్చినన్యాయమూర్తులు కూడా ఉన్నారు. రాజ్య వ్యవస్థ ఒత్తిడిని లెక్క చేయకుండా న్యాయ దృష్టితో, రాజ్యాంగ పరిధిలో వచ్చిన తీర్పులు వాటిని రాసిన న్యాయ మూర్తులు చరిత్రలో, శాశ్వత స్థానం పొందారు. అన్యాయమైన తీర్పులు ఇచ్చిన "న్యాయ మూర్తులు" కూడా చరిత్రలో స్థానం పొందారు. కానీ అవి నల్లని అక్షరాలతో రాయబడతాయి. జనం మదిలో వారు అన్యాయ మూర్తులుగా మిగిలి పోతారు.నేరస్తుడికి బెయిల్ ఇవ్వడం కోసం లంచం తీసుకొని, దొరికి పోయి ఆత్మహత్య చేసుకున్న "న్యాయ మూర్తి"ని కూడా మనం చూశాం. ఇంట్లో కుప్ప లు కుప్పలుగా కరెన్సీ నోట్ల కట్టలతో దొరికి పోయిన న్యాయ మూర్తి ఉదంతం కూడా మన కళ్ల ముందే ఉన్నది. సర్కారు అభీష్టానికి అనుకూలంగా తీర్పునిచ్చి క్విడ్ ప్రొకో అవగాహనతో దేశ అత్యున్నత చట్ట సభ సభ్యుడిగా మారిపోయిన అతి పెద్ద "న్యాయమూర్తి" ఉదంతం కూడా మన కళ్ల ముందే ఉన్నది. నేరం ఆరోపించబడి ఎలాంటి విచారణ లేకుండానే అన్యాయం గా జైళ్లలో మగ్గి పోతున్న అమాయకులు లక్షల సంఖ్యలో ఉన్న దుస్థితి ఇప్పుడు ఈ దేశంలో కొనసాగుతున్నది. నేరం నిరూపించకుండానే ఆరోపిత నేరానికి మాత్రమే సదరు నేరానికి విధించగల గరిష్ఠశిక్షా కాలానికి మించి జైళ్లలోనే మగ్గిపోతున్న అమాయకుల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. న్యాయమూర్తుల ఎంపికలో కొలీజియం వ్యవస్థ ద్వారా ఎంతో కొంత స్వతంత్ర వ్యవస్థగా పని చేస్తున్న న్యాయ వ్యవస్థను ఎగ్జిక్యూటివ్ వ్యవస్థలో భాగంగా మార్చి వేసుకొని తమ దొడ్డిలో బంధించే ఒక పెద్ద కుట్రను ప్రస్తుత అధికార వ్యవస్థ పన్నింది. దాని కోసం చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నది.ఒకవేళ అదే జరిగితే ఈ దేశంలో న్యాయం అనేది ఒక కొనుగోలు సరుకు గా మారిపోయి సామాన్యులు పేదలు, బలహీనులు అన్యాయమై పోయే అతి పెద్ద ప్రమాదం తలెత్తుతుంది.

గోవర్ధన్ గండె,
9347056621.

ప్రజల మనోభావాలకు పాలకులు జవాబుదారులుగా ఉండాలి

త్వరలో రాష్ట్రం లో కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికలు జరగనున్నాయి. 11 ఫిబ్రవరి న మన రాష్ట్రం లో ఎన్నికలు జరగనున్నాయి.నామినేషన్ పర్వం ముగిసింది .నాయకులు ఎలా వుండాలో తెలుసుకుందాం.పురాణాల్లో రాజుల గురించి విన్నాం చదివాం. ఆనాడు రాజులు ఆదర్శంగా ప్రజలకు జవాబుదారీగా ఉన్నారు. ప్రజలను కన్నబిడ్డలా చూసుకున్నారు. తమ పాలన గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడానికి రాజప్రసాధం లో మారువేశాలతో సాధారణ వ్యక్తుల జనావాసాలు సంచరించారని చదువుకున్నాం. కాలం మారింది రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. రాజరికం పోయి ప్రజాస్వామ్యం వచ్చింది. రాజులనాటి కాలంలో రాజులు చెప్పిందే వేదం అయితే ప్రజాస్వామ్యంలో ప్రజలు తమకు నచ్చిన వారిని సమర్ధులను ఎన్నుకుంటారు. అందుకే ప్రజల కోసం ప్రజల చేత ఎన్నుకోబడి ప్రజలే పరిపాలకులుగా ఎన్నికయ్యే మహత్తరమైనది మన ప్రజాస్వామ్య వ్యవస్థ. కానీ ప్రజల కోసం సేవ చేసే నిజమైన నాయకుడు కొనసాగే ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో ప్రలోభాలు డబ్బు, మద్యం వంటి వాటి ప్రభావంతో పాటు నేరచరిత్రలో అక్రమార్కుల సైతం అక్కడక్కడ చొరబడితే వ్యవస్థ స్ఫూర్తి క్రమంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రమాదం నివారించాలంటే ఓటర్లు ఓటు హక్కు ద్వారా తమ నాయకుణ్ణి ఎన్నుకోవచ్చు. నాయకులు వ్యవస్థ నడిపించే సత్తా కలిగిన వారై ఉండాలి .వారి మనసుతో పాటు నడక, నడత ఆలోచనలు చేసే పనులన్నీ నిస్వార్ధంగా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించేలా స్ఫూర్తి మంతపై మొత్తానికి ఆదర్శంగా ఉండాలి. నాయకుడు కూడా తన పరిధిలోని ఏ ఆపద వచ్చినా నేను ఉన్నానని భరోసా ఇచ్చే విధంగా కడుపులో పెట్టుకొని చూసుకోవాలి.ప్రజలందరినీ సమదృష్టితో చూడగలగాలి. రానున్న కాలానికి ప్రజల అవసరాలు ఎలా ఉంటాయి. అందుకు అనుగుణంగా ఏమి చేయగలమో చూడగలిగే దార్శనిక దృష్టి అవసరము. అర్హులైన అత్యంత పేదరికంలో ఉన్న వారిని గుర్తించ గలగాలి. ప్రభుత్వము అమలు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయో లేదో గమనించాలి. ప్రజల సమస్యలను వారి దృష్టి కోణంలో చూసి చట్టసభల్లో వాటికి పరిష్కారాన్ని వెతికే ప్రయత్నం చేయాలి. మొత్తానికి తన నియోజకవర్గ ప్రజలపై రాజకీయాలకు అతీతంగా చల్లని చూపు కలిగి ఉండాలి.మంచి మాటలు చేటు కలిగించే చెడు మాటలను వేరు చేసి వినగలిగాలి. విమర్శలకు కృంగిపోకుండా పొగడ్తలకు పొంగిపోకుండా రెండిటిని సమంగా విని సమతుల్యత పాటించాలి. ఎందరు వారించిన వినకుండా ప్రజల మనోభావాలకు పాలకులు జవాబుదారులుగా ఉండాలని ప్రవేశం చేయించారని చెబుతారు. ముఖ్యంగా ప్రతిపక్షం చేసే విమర్శలను ఓపికగా విని వాటిలో నిజ నిజాలు గుర్తిరెగి అందుకు అనుగుణంగా వ్యవహరిస్తే బాగుంటుంది. ప్రజల బాగోగులపై స్పం దిం చే గుణం ఉండాలి. అలాంటప్పుడే ప్రజల హృదయాల్లో కొంత కాలం మంచి స్థానం పొందుతారు. సమస్యలు బాధలతో తన వద్దకు తెచ్చే వినతులను దయార్ధ హృదయంతో స్వీకరించాలి. చేసే పనులు ఆచరణలో దయా గుణం ప్రతిబింబించాలి.రాజకీయం అంటే వృత్తి కాదు అని గుర్తించాలి. ప్రజా ప్రతినిధిగా ఎన్నికైన వారు నిర్ణీత పదవీకాలం పూర్తి చేశాక తన జీవన గమనానికి కుటుంబ పోషణకు ఏదో ఒక వృత్తి ఎంచుకొని ముందుకు సాగేలా ఉండాలి. చేతులకు అవినీతి అక్రమాల మకిలి అంటకుండా చూసుకోవాలి .తన పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు ఉన్నప్పుడు వారికి అభయహస్తం అందించేలా ఉండాలి. ముందు తరాలకు ప్రజాస్వామ్య ఫలాలు అందించేలా ప్రణాళికలు రాయగలగాలి.గతంలో అనేకమార్లు వివిధ శాసన సభ ఎన్నికల్లో,పార్లమెంట్ ఎన్నికల లోఅనేక సార్లు గెలుపొంది ప్రజా దరణ పొందిన శాసన సభ్యులు,లోకసభ సభ్యులు వున్నారు.అవినీతి, అక్రమాల కి పాల్పడకుండా సాధారణ జీవితం గడిపి ఆర్టీసి బస్సులు,ఆటోలలో అసెంబ్లీ కి పోయిన శాసన సభ్యులు,పార్లమెంట్ సభ్యులు వున్నారు.కౌన్సిలర్లు కార్పొరేటర్స్ ప్రజలకు సేవకులు గా వుండాలి.అధికార గర్వం , అహంకారం వుండకూడదు.ఇన్ని లక్షనాలు పోటీ చేసే నాయకుడు లో వుండాలి.

కామిడి సతీష్ రెడ్డి

ఆర్థిక వ్యవస్థను మరింత పతనం చేసే బడ్జెట్

ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి, దాని నుంచి బయటపడటానికి ఏ మాత్రం అవకాశం లేని బడ్జెట్.ఆర్థిక వ్యవస్థను మరింత దిగజారేలా ఈ బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి. బడ్జెట్ వల్ల రూపాయి పతనమై పోయే ప్రమాదం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి, సంక్షోభాలు ఉన్నప్పుడు దేశాన్ని వాటి నుంచి బయటపడేయడానికి ఏ మాత్రం దిశానిర్దేశం ఈ బడ్జెట్ ఇవ్వలేదు. అందుకే ఇది దిశానిర్దేశం లేని బడ్జెట్. పెద్ద పెద్ద ప్రకటనలు చేశారేగాని, ప్రభుత్వం విధించిన కోతలు చెప్పలేదు. పౌరుల వినిమయ శక్తి పడిపోయిందని ఆర్థిక సర్వే సైతం చెపుతున్నా, బడ్జెట్ దాన్నికనీసం పరిగణనలోకితీసుకోలేదు. సామాజిక రంగాన్ని పద్ధతి ప్రకారం విధ్వంసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం గ్రామీణ భారతానికి ఊతం కలిగించే ఏ ఒక్క చర్య బడ్జెట లో లేదు. గ్రామీణ ఉపాధికి చుక్కానిలా ఉండే ఉపాధి హామీ పథకాన్ని గత ఆర్థిక సంవత్సరంలో విచ్ఛిన్నం చేసిన ప్రభుత్వం వీబీ జీరామ్‌జీ పేరుతో కొత్త పథకాన్ని పెట్టి కూలీల నోటికాడ కూటినికొట్టేసింది. అటుపట్టణ కార్మికులహక్కులను కాలరాసేలా నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చికార్పొరేట్లకు దాసోహమైంది. వాటిని నుంచి వెసులుబాట్లను ఈ బడ్జెట్ ఇవ్వలేకపోయింది. కార్మిక హక్కుల రక్షణ, సామాజిక భద్రత లేకుండాపోయింది. ఈ బడ్జెట్ వాటి నుంచి ఉపశమనం కల్పించలేదు. వ్యవసాయ రంగానికి పెద్దపేట వేస్తామని చెప్పారు. కానీఅది జరగలేదు. రైతుకు వెన్నుపోటు పొడిచారు. వ్యవసాయంపూర్తిగాసంక్షోభంలో పడిపోయింది. కొన్ని రకాల ఎరువులపై దిగుమతి ఫీజులు తొలగించడంతో అమ్మోనియా ఫాస్ఫేట్, అమ్మోనియా నైట్రో ఫాస్ఫేటు వంటి ఎరువుల ధరలు పెరుగుతాయి. ఇది పూర్తిగా రైతులకు భారమే. వ్యవసాయంలోచందనం, కొకోవా, కోకోనట్, ఆల్మండ్స్ సాగుకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చారు. వరి, గోధుమ, ఇతర వ్యవసాయ, వాణిజ్య పంటలు పండించే 75 శాతం మంది రైతులకు చేసిందేమీ లేదు. వారికి ఎలాంటి ప్రోత్సాహకాలు లేవు. రైతులకు సాంకేతిక తోడ్పాటు గురించి అతిగా చెప్పారు. దాని వల్ల పెద్దగా ఉపయోగం లేదు. 15 కోట్ల మంది రైతు కుటుంబాలను దగా చేసింది.విద్యాఆరోగ్య రంగాలనుపూర్తిగా విస్మరించారు. మెడికల్ టూరిజంపై దృష్టి పెట్టే బదులు ప్రభుత్వ మెరుగుదలపై దృష్టి పెడితే 130 కోట్ల మంది ప్రజలకు మంచి వైద్యం అందుతుంది. అదానీ, అంబానీలకు ఆస్తులు అప్పగించడం తప్ప చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు లేవు. ఎంఎస్ఎమ్ఈ లను కూడా విస్మరిస్తున్నారు. పరిశ్రమలకు సరైన ప్రోత్సకాలు లేనందునే స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. ఆదాయపన్ను తగ్గింపుపై ఆశించిన వేతన జీవులకు నిరాశే ఎదురైంది. పైగా కొత్త ఆదాయపన్ను చట్టం ఏప్రిల్ 1 నుంచే అమలవుతున్నందున కనీసం ఏడాదిపాటు చట్టం అర్థం చేసుకోవడంపై గందరగోళమే తప్ప ఇంకేమీ ఉండదు.53,47,315 కోట్ల బడ్జెట్ లో కనీసం 5 శాతం అయినా వ్యవసాయానికి కేటాయించి ఉంటే బాగుండేది. రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. కనీసం గిట్టుబాటు ధర కూడా లేదు. ఈ విషయాన్ని మోడీ ప్రభుత్వం పూర్తిగా వదిలేసింది. రైతు ఆదాయాన్ని రెండు రెట్లు చేస్తామని 12 ఏళ్ల క్రితం చెప్పిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు సన్న చిన్నకారు రైతులకు ప్రోత్సాహకాలు ప్రకటించామని చెబుతోంది. దీనిపై స్పష్టత లేదు. ఆరెంజ్ ఎకానమీకి ప్రోత్సాహం ఇవ్వడం వల్ల చిన్న పరిశ్రమలకు ఒరిగేదేమీ ఉండదు. కొత్త బడ్జెట్ భవన నిర్మాణ రంగాన్ని కుదేలు చేస్తుంది. ఎన్నికలు జరగబోయే ఐదు రాష్ట్రాలకు మాత్రం బడ్జెట్లో కొన్ని రాయితీలు ప్రకటించడం గమనార్హం. ఇది ఒక విధంగా ఎన్నికల బడ్జెట్. ఈసారి రెండు తెలుగు రాష్ట్రాలకు మొండిచేయి చూపారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణానికి కేటాయించిన అప్పులే చెప్పారు తప్ప కేంద్ర నిధులు అంటూ ఏమీ లేవు. పోలవరం ప్రాజెక్టుకు రూ.3,320.39 కోట్లు, అమరావతి అభివృద్ధికి ఏబీడీ బ్యాంక్ నుంచి రూ.1,128.91 కోట్లు, అమరావతి సమీకృత పట్టణాభివృద్ధి పేరుతో రూ.432.09 కోట్ల జపాన్ నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇవన్నీ రుణాలే, కేంద్ర నిధులు కాదు. పైగా ఇవన్నీ పాతలెక్కలే. కొత్త కేటాయింపులు కాదు. ఏపీ గ్రామీణ రహదారి ప్రాజెక్టులకు రూ.500.99 కోట్లు, పట్టణ తాగు, మురుగు నీటి పారుదల నిర్వహణకు రూ.800 కోట్లు, ఏపీ ప్రకృతి వ్యవసాయానికి రూ.155.32 కోట్లు ఇస్తున్నామని చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే ఇవన్నీ చాలా స్వల్పం. రాష్ట్ర విభజన హామీలను మరోసారి విస్మరించారు. నిర్మలా సీతారామన్ ప్రసంగం చేసేటప్పుడు బీజేపీ సభ్యులు 150సార్లు చప్పట్లు కొట్టారు, బెంచీలు చరిచారు. చప్పట్లు కొట్టేటంత గొప్పగా బడ్జెట్ లేదు. ఎందుకు కొట్టారో అర్థం కావడం లేదు. ఏఐ గురించి 11 సార్లు ప్రస్తావించిన నిర్మల సమగ్ర విధానాన్ని ప్రకటించలేకపోయారు. మొత్తం మీద ఈ బడ్జెట్ కార్పోరేట్లకు వరాలుగా, సామాన్యులకు శరాఘాతాలుగా ఉంటుందటంలో సందేహం లేదు.

కె.రామకృష్ణ, సిపిఐ జాతీయ కార్యదర్శి